క్లుప్తంగా

నిధుల మంజూరుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడెం: కడెం ప్రాజెక్ట్ మరమ్మతులకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ నిధులు మంజూరు చేసి రైతులకు అండగా నిలిచారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ప్రాజెక్టు వద్ద సీఎం, స్థానిక ఎమ్మెల్యే చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్, భూషణ్, రమేశ్, రఫీక్, రాజు, రాజేశ్వర్, తిరుపతి, మల్లయ్య పాల్గొన్నారు.

కుట్టుమిషన్ పరికరాల అందజేత

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి, బీర్నంది, బావాపూర్(ఆర్), రాంరెడ్డి పల్లె, రంగపేట్ గ్రామాల్లో కుట్టుమిషన్ కుడుతున్న మహిళలకు డ్రీం సొసైటీ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ పరికరాలను సోమవారం అందజేశారు. సొసైటీ కోఆర్డినేటర్ చిన్నయ్య ఆధ్వర్యంలో కుట్టుమిషన్ పరికరాలు కత్తెర, 25 రంగుల దారాలు, టేపు, ఆయిల్, సూదులు, కలర్ మార్కర్లు వంటి పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో స్వరూప, రాజకళ తదితరులు ఉన్నారు.

గోడలపై రాతల తొలగింపు



రాతలు చెరిపివేస్తున్న సిబ్బంది

సోన్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఎంపీడీవో సురేశ్ తెలిపారు. సోమవారం మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల గోడలపై ఉన్న వివిధ రాజకీయ పార్టీల గుర్తులను, రాతలను పంచాయతీ సిబ్బందితో తొలగించినట్లు పేర్కొన్నారు. కార్యదర్శి సంధ్యారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

ఖానాపూర్: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో జారీ చేయడం హర్షణీయమని ఆ సంఘం తిమ్మాపూర్ అధ్యక్షుడు కడుకుంట్ల రవి అన్నారు. సోమవారం సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, నిమ్మల రమేశ్, బీసీ రాజన్న, లక్ష్మణ్, ప్రదీప్, కిశోర్, రాములు, శ్రీనివాస్, శ్రీను, తనుగుల రమేశ్, బీసీ రమేశ్, భీమన్న, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

పూడిక తొలగింపు



పేరుకుపోయిన చెత్తను తీయిస్తున్న చైర్మన్

ఖానాపూర్: పట్టణంలో శని, ఆదివారాల్లో కురిసిన అకాల వర్షాలతో పేరుకుపోయిన చెత్త తొలగించేందుకు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. డ్రెయినేజీల్లో నిండిన ప్లాస్టిక్ కవర్లు, పూడికను దగ్గరుండి తీయించారు. వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను డ్రెయినేజీల్లో పడేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బస్సు ట్రిప్పులు పెంచాలి



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

నిర్మల్‌టౌన్: మామడ మండలం పొనకల్ గ్రామానికి అదనపు బస్సు ట్రిప్పులు పెంచాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం జిల్లా కేంద్రంలోని డిపో కార్యాలయంలో మేనేజర్ ప్రతిమారెడ్డికి వినతిపత్రం అందజేశారు. నిర్మల్ డిపో నుంచి కమల్కోట్ గ్రామానికి నడుపుతున్న బస్సు ట్రిప్పుల సంఖ్య పెంచితే పొనకల్ గ్రామస్తులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. స్పందించిన మేనేజర్ మరో రెండు ట్రిప్పులు పెంచుతామని హామీ ఇచ్చారు.

టీకాలు వేయించాలి

ఖానాపూర్: పట్టణంలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని వెటర్నరీ ఏడీ రామచంద్రుడు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని విద్యానగర్ కాలనీలో టీకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఏప్రిల్ 3 వరకు జరిగే శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షేక్ తైసిన్, రైతులు నర్సయ్య, రామకృష్ణ ఉన్నారు.

ప్రారంభమైన 'పది' పరీక్షలు



ఖానాపూర్‌లోని ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థుల సందడి



భైంసారూరల్: తిమ్మాపూర్‌లో కేంద్రం వద్ద..



కడెం పరీక్ష కేంద్రంలో విద్యార్థులు, ఇన్విజిలేటర్



లక్ష్మణచాంద: వడ్యాల్‌లో హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



సోన్: లెఫ్ట్ పోచంపాడ్ పాఠశాలలో హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది



కుంటాలలో తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



లోకేశ్వరంలో పెన్నులు అందిస్తున్న యువకులు

భైంసాటౌన్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా.. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర పాఠశాల, కిసాన్‌గల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్, జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాల, వాసవి హైస్కూల్, వేదంతోపాటు తిమ్మాపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1538 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 1535 మంది హాజరయ్యారు. మొదటిరోజు ముగ్గురు మాత్రమే గైర్హాజరయ్యారు.

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 153 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రమణారావు తెలిపారు. పరీక్షా కేంద్రాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 168 మంది విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హాజరైనట్లు సీఎస్ సదానందం, డీఓఆర్ బీఎల్ఎన్ చారి తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ వేణుగోపాల్ తనిఖీ చేశారు.

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో తొలిరోజు తెలుగు పరీక్షకు 197 మంది విద్యార్థులకు ఒకరు మాత్రమే గైరాజరైనట్లు సీఎస్ ఎ.రాజేశ్వర్, డీవోఆర్ రాజేశ్వర్ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఎంఈవో ముత్యం తనిఖీ చేశారు.

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 683 మంది విద్యార్థులకు గాను వంద శాతం హాజరయ్యారని నిర్వాహకులు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ శివరాజ్, ఎస్సై లింబాద్రి తనిఖీ చేశారు.

ముథోల్: మండల కేంద్రంలో బాలుర గురుకుల పాఠశాల, బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, ఎస్టీ బాలుర వసతిగృహం, అక్షర మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాసరలో జెడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు అష్ట జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 780 మంది విద్యార్థులకు గాను 779 మంది పరీక్ష రాసినట్లు ఎంఈవో మైసాజీ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

కడెం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 248 మంది విద్యార్థులకు గాను వందశాతం పరీక్ష రాసినట్లు ఎంఈవో మధుసూదన్ తెలిపారు. కేంద్రాన్ని తహసీల్దార్ సుజాత తనిఖీ చేశారు.

పెంబి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 118 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ఒకరు గైర్హాజరైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. బాలురు 48, బాలికలు 69 పరీక్షకు హాజరయ్యారు.

సోన్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, లెఫ్ట్ పోచంపాడ్ సాంఘీక సంక్షేమ గురుకులంలో పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ కస్తూరి శంకర్ తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాల్లో వందశాతం విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో 201 మంది, పోచంపాడ్ పాఠశాలలో 152 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు తెలిపారు. అంతకుముందు పోచంపాడ్ కేంద్రాన్ని ఎంపీడీవో సురేశ్ పరిశీలించారు.

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ పరీక్ష కేంద్రంలో 138 మంది విద్యార్థులకు గాను వంద శాతం, లక్ష్మణచాంద కేంద్రంలో 199 మంది విద్యార్థులకు గాను వందశాతం పరీక్ష రాసినట్లు ఆయా పరీక్ష కేంద్రాల సీఎస్‌లు ఈశ్వర్, గోపాల్‌రెడ్డి, డీవోలు విజయభాస్కర్, నాగేష్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జి ఎంఈఓ మధుసూదన్, తహసీల్దార్ జానకి, డీటీ రోహిదాస్ తనిఖీ చేశారు.

తానూరు: మండలంలో ఎల్వి, భోసి, తానూరులో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 411 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా అందులో 410 మంది హాజరైనట్లు ఎంఈవో సుభాశ్ తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

సారంగపూర్: సారంగాపూర్ ఉన్నత పాఠశాలలో 180 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 154 మంది విద్యార్థులకు గాను వందశాతం హాజరైనట్లు ఎంఈవో మధుసూదన్ తెలిపారు. బీరవెల్లి ఉన్నత పాఠశాలలో 60మందికి గాను 59 మంది హాజరవగా ఒకరు గైర్హాజరయ్యారని అన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వందశాతం పరీక్షలకు హాజరైనట్లు కేంద్రం నిర్వాహకులు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 152 మంది విద్యార్థులు, జూనియర్ కళాశాలలో 118 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. చీఫ్ సూపరిటెండెంట్ రమణారెడ్డి, నాపే ఖాన్, డీవో రాంమోహన్, రతన్‌కుమార్ ఉన్నారు.

కుభీర్: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 204 మంది విద్యార్థులకు గాను వందశాతం హాజరైనట్లు ప్రధానోపాధ్యాయులు జె.సాయన్న తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా విద్యాధర్, డిపార్ట్‌మెంటల్‌గా సురేశ్ వ్యవహరించారు.

అందుబాటులో ఎరువులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంతో పాటు గ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ సీఈవో భూమి ఆశన్న తెలిపారు. యూరియాతో పాటు 20-20-0-13తోపాటు క్రిబికో డీఏపీ, సేంద్రియ ఎరువులు ఉన్నాయని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

మామడ: వ్యక్తిగత కారణాలతో బీఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఏనుగు లింగారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కాలగిరి గంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము ఏయే పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఖానాపూర్: పట్టణ పరిధిలోని ఒడ్డెవాడ, తిమ్మాపూర్ పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎంపీవో చంద్రశేఖర్ పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్రాల్లోని సౌకర్యాలపై వివరాలు సేకరించారు. వారి వెంట పలువురు మెప్మా సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమాచారమిస్తే పరీక్ష కేంద్రానికి తీసుకెళ్తాం

లోకేశ్వరం: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ముందుగా తమకు సమాచారమిస్తే ప్రత్యేక వాహనంలో పరీక్ష కేంద్రానికి తీసుకెళ్తామని మాఅమ్మ-నాన్న ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రానికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఆలస్యమయ్యే విద్యార్థులు 99122 67973 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విచారణ చేయాలని ఫిర్యాదు

ఖానాపూర్: కడెం మండలంలోని నర్సాపూర్ నుంచి లింగాపూర్ గ్రామం వరకు రూ. 2 కోట్లతో ఐదు కిలోమీటర్ల మేర చేపట్టిన రోడ్డు పనులపై విచారణ చేయాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శులు పీటర్, సురేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయమై ఉట్నూర్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనుల్లో నాణ్యత పాటించలేదని వాపోయారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ



సత్తనపల్లిలో పరిశీలిస్తున్న సీడీపీవో సరిత



తానూరు: మొగ్గిలో పరిశీలిస్తున్న శారద

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి, పాతఎల్లాపూర్-2 గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఐసీడీఎస్ సీడీపీవో సరిత, సూపర్‌వైజర్ శ్రీలత తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు రోజు కేంద్రాలకు వచ్చి పోషకాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు తప్పనిసరిగా ఈనెలలో కుటుంబ సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్లు దేవిక, సత్తమ్మ, తదితరులు ఉన్నారు.

తానూరు: మండంలంలోని మొగ్గి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఐసీడీఎస్ సూపర్ వైజర్ శారద తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి మెనూ ప్రకారం చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. చిన్నారుల ఎత్తు, కొలతల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్ వాణి తదితరులు ఉన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్
- ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు సాయం



వట్టోలిలో మాట్లాడుతున్న నారాయణ్‌రావు

లోకేశ్వరం: ఇళ్లను కోల్పోయామని అధైర్యపడొద్దని.. ప్రభుత్వం తరఫున ఆదుకొని అండా ఉంటామని ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ బాధిత కుటుంబాలకు భరోసానిచ్చారు. సోమవారం మండలంలోని వట్టోలి గ్రామంలో ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు కాలిపోయిన ఎగ్గం పెద్ద భూమన్న, సాయన్న కుటుంబాలను పరామర్శించారు. ఈసందర్భంగా ఘటనకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణ సాయం కింద రూ.11 వేలు, 150 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి, భైంసా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఓంప్రకాశ్‌లడ్డా, సాయన్న, శ్రీనివాస్‌గౌడ్, నర్సయ్య, సుధాకర్, రాజేశ్వర్, చిన్నారెడ్డి ఉన్నారు.

కల్లూర్‌లో..

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో గుద్దేటి గంగాధర్ తండ్రి భూమన్న మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం నారాయణరావు పటేల్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, మాజీ ఎంపీపీ సయ్యాజి భోజరాంపటేల్, లోకేశ్వరం వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.


పన్నులు చెల్లించని వారి ఆస్తులు సీజ్



సీజ్ చేస్తున్న అధికారులు

నిర్మల్‌టౌన్: పట్టణంలోని ప్రియదర్శినినగర్, గాజులపేట్ కాలనీల్లో ఆస్తి పన్ను బకాయిదారుల ఆస్తులను మున్సిపల్ అధికారులు సోమవారం జప్తు చేశారు. కొన్ని రోజులుగా పన్ను చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో వారి ఆస్తులు జప్తు చేసినట్లు రెవెన్యూ ఆఫీసర్ అనూప్‌కుమార్ తెలిపారు.

మండల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మామడ: పొన్కల్‌ను మండలంగా ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభించాలని కోరుతూ మండల జేఏసీ నాయకులు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు సోమవారం జిల్లా కేంద్రంలో వినతిపత్రం అందించారు. గతంలో ప్రిలిమనరీ నోటిఫికేషన్ వచ్చినందున గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జేఏసీ నాయకులు సుధాకర్‌రెడ్డి, నర్సారెడ్డి, చిన్నయ్య, ముత్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మామడ మండలం పొనకల్ గ్రామంలో రెడ్డి సంఘం భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.ఐదు లక్షలు మంజూరు చేయించినందుకు సంఘ సభ్యులు జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శ్రీహరిరావును మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

జోరుగా 'ఉపాధి' పనులు

- ఇప్పటికే లక్ష్యం చేరుకున్న లక్ష్మణచాంద మండలం
- అడిగిన వారికి పనులు కల్పిస్తున్నామంటున్న అధికారులు
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో పెరగనున్న కూలీలు



లక్ష్మణచాందలో జరుగుతున్న ఉపాధి పనులు

లక్ష్మణచాంద: ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకొని లక్ష్మణచాంద మండలం జిల్లాలో ముందు వరుసలో కొనసాగుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో లక్ష్మణచాంద మండలానికి 2 లక్షల 90 వేల పనిదినాలు నిర్దేశించగా.. ఇప్పటికే కూలీలకు 3 లక్షల 4 వేల పని దినాలు కల్పించినట్లు ఈజీఎస్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం చివరకు చేరింది. ఈ నెలాఖరులోగా వంద రోజుల పని దినాలు నిండని కూలీలకు ఉపాధి కల్పించేందుకు గ్రామాల్లో పనులు వేగవంతం చేస్తున్నారు.

మండలంలో..

లక్ష్మణచాంద మండలంలో 18 గ్రామ పంచాయతీల పరిధిలో 23 గ్రామాలుండగా మొత్తం కూలీలు 17,681 ఉన్నారు. ఇందులో ప్రస్తుతం 8,395 మంది తరచుగా కూలీ పనులకు వస్తున్నట్లు ఈజీఎస్ అధికారులు పేర్కొన్నారు. మండలంలో మొత్తం 9,495 జాబ్‌కార్డులు ఉండగా.. ప్రస్తుతం 5,411 ఆక్టివ్ జాబ్‌కార్డులు ఉన్నాయి. మండలంలో నిత్యం 1250 నుంచి 1300 మంది వరకు కూలీలు ఉపాధి పనులకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు.

లక్ష్యం దాటిన మండలం..

2023-24 ఆర్థిక సంవత్సరంలో కూలీలకు రెండు లక్షల 90 వేల పనిరోజులు కల్పించాలనే లక్ష్యం మండలానికి నిర్దేశించారు. కానీ ఇప్పటికే మండలంలో 3 లక్షల 4 వేల పని దినాలు కల్పించినట్లు ఏపీవో ప్రమీల తెలిపారు. టార్గెట్ కంటే ఎక్కువ పని దినాలు కూలీలకు కల్పించామని ఏపీవో పేర్కొంటున్నారు. ఏప్రిల్ మాసం నుంచి నూతన పని దినాలు ప్రారంభం అవుతుండటంతో అప్పుడు పనులకు వచ్చేవారి సంఖ్య మరింత పెరుగుతుందని అధికారులు అంటున్నారు.

వ్యవసాయ పనుల్లో నిమగ్నం..

మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రస్తుతం మొక్కజొన్న పంట కోతలు జరుగుతున్నాయి. దీంతో కూలీలు ఎక్కువగా ఈ వ్యవసాయ పనులకే వెళ్తున్నారు.. ఉపాధి పనులకు వెళ్లడం లేదు.

వంద రోజులు పని కల్పిస్తున్నాం

మార్చి నెల కావడంతో వందరోజుల పని దినాలు పూర్తి చేసిన వారికి కాకుండా.. వంద రోజుల పని దినాలకు చేరువలో ఉన్న కూలీలకు పనులు కల్పిస్తున్నాం. పార్‌పెల్లి, లక్ష్మణచాంద, మునిపెల్లి, ధర్మారం, తిర్పెల్లి గ్రామాలకు క్షేత్ర సహాయకులు లేరు. ఈ విషయమై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం. క్షేత్ర సహాయకులు వస్తే కూలీలు పెరిగే అవకాశం ఉంది. ఏప్రిల్‌లో నిత్యం 5వేల వరకు కూలీలు పనులకు వచ్చే అవకాశం ఉంది.

– ప్రమీల, ఏపీవో

'చెన్నూర్-బాసర రైల్వేలైన్ ఏర్పాటు చేయాలి'

ఖానాపూర్: చెన్నూర్ నుంచి మంచిర్యాల మీదుగా నిర్మల్ బాసర రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ రైల్వే వ్యవస్థాపక సాధన సమితి సభ్యుడు గాడుపు రవి కోరారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమకు రైల్వేలైన్ ఏర్పాటు చేసిన వారికే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపిస్తామని పేర్కొన్నారు. రైల్వేలైన్‌తో పాటు ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కడెంలో వ్యవసాయ కళాశాల, ఉట్నూర్‌లో ట్రైబల్ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. సదర్మాట్ కెనాల్‌ను టెక్నికల్ ఇంజినీర్ బృందంతో రీ సర్వే చేయించి వరదలతో తెగిపోకుండా పరిష్కారం చూపాలని కోరారు. ప్రజల ఇబ్బందులను దూరం చేసేందుకు పెంబి మండలం సిరిచెల్మ రోడ్డుకు అటవీ అనుమతులు ఇప్పించాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్.. కంచె ఏర్పాటు చేయరూ..



భైంసారూరల్: మండలంలోని వాలేగాం గ్రామంలో హనుమాన్ ఆలయం పక్కన ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన మినీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో వచ్చి పోయే ప్రజలు, పశువులకు ముప్పు పొంచి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణగా కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రాంబాబు, విద్యుత్ ఏఈ, ఫోన్: 83339 23869

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలో వెలసిన శ్రీ అగ్గిమల్లన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. పండితులు హరీశ్‌కుమారాచారితోపాటు మాధవాచారి, వెంకటాచారి ఆధ్వర్యంలో వేద పారాయణం, మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణాధారణ, రుత్విక్‌వరణం, యాగశాల ప్రవేశం, బ్రహ్మ కలశ స్థాపన, నవగ్రహ వాస్తు సర్వతోభద్రాది మండల అవాహన, అగ్నిప్రతిష్ఠ, మహాగణాధిపతి హోమం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, జలాధివాసం, హవనం, తదితర పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.